ధరణి ఎత్తేస్తే పట్వారీ రాజ్యం!

ప్రస్తుతం భూముల రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో

లావాదేవీలన్నీ ఆటోమెటిక్‌గా నిర్వహణ

ధరణిని రద్దుచేస్తే మళ్లీ రాత, రోత రోజులే

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'మీకు ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ భూమి ఉంటే, పట్టాదారు పాస్ పుస్తకం ఒక్కటే సరిపోదు. ప్రతి సంవత్సరం కచ్చితంగా పహాణీ కాపీ తీసుకొని దగ్గర పెట్టుకోండి. అందులో మీ పేరు ఉన్నదో లేదో చూసుకోండి. సేత్వార్ రికార్డును కూడా మీ దగ్గర ఉంచుకోండి. ఎందుకంటే మీ భూమి ఎప్పుడైనా మీది కాకుండా పోవచ్చు'.. ఒకప్పుడు భూ నిపుణులు, న్యాయ నిపుణుల సూచనలివి. ఉమ్మడి రాష్ట్రంలో భూముల రికార్డుల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉండేదో చెప్పేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు. గ్రామ స్థాయి, మండలస్థాయి అధికారుల చేతుల్లో అధికారం ఉన్నప్పటి అవినీతి గురించి దేశవ్యాప్తంగా చర్చ నడిచేదంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా పట్వారీ వ్యవస్థ ఉన్న సమయంలో భూముల రికార్డులు, రైతుల తలరాతలు ఎంత సులభంగా మారిపోయేవో ఇప్పటికీ కథలుగా చెప్పుకుంటారు. 1814లో బ్రిటిష్ ప్రభుత్వం పట్వారీల నియామకాలను చట్టబద్ధం చేసింది. అప్పటి నుంచి చేతిరాత పద్ధతిలో భూముల రికార్డులు నిర్వహించే వారు. వారు ఎవరి పేరు రాస్తే వాళ్లే యజమానులు. కలం పోటుతో రైతుల తలరాతలు మార్చేసేవారు. ఎన్టీఆర్ హయాంలో పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి.. ఎమ్మార్వోలు, ఆర్‌ఐలు, వీఆర్వోలతో రెవెన్యూ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అయితే అధికారుల నిర్వాకం వల్ల రైతుల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది. పహాణీ రికార్డులు వీఆర్వోల ఇండ్లలో ఉండటంతో వాళ్లు రాసిందే రాత, గీసిందే గీత అన్నట్టు సాగింది. తెల్లారేసరికి పహాణీల్లో పేర్లు మారిపోయేవి. దీంతో పంటలు పండించాల్సిన రైతులు.. వీఆర్వో నుంచి నుంచి సీసీఎల్‌ఏ వరకు, కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఏండ్లకేండ్లు ప్రదక్షిణలు చేశారు. నాట్లు వేయాల్సిన చేతితో దండాలు పెట్టాల్సి వచ్చేది. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఈ చిక్కుముడులన్నింటినీ పరిష్కరించారు. 2017లో భూ రికార్డుల ప్రక్షాళణతో రికార్డులన్నీ డిజిటలైజ్ కాగా, 2020లో ధరణి పోర్టల్‌తో పారదర్శక, వేగవంతమైన లావాదేవీలు మొదలయ్యాయి. భూ రికార్డుల నిర్వహణ అధికారుల చేతుల్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటికప్పుడే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిపోతున్నాయి. రైతుల వివరాలు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా, ఏ క్షణమైనా పోర్టల్‌లో చెక్ చేసే అవకాశం కలిగింది. రైతు వచ్చి వేలిముద్ర వేస్తే తప్ప పట్టా మార్పిడి జరగదు. అప్పటి నుంచి రైతులు తమ భూముల రికార్డులు భద్రంగా ఉన్నాయని గుండెల మీద చేయి వేసుకొని నిద్రపోతున్నారు. ధరణిని రద్దు చేస్తామని, పాస్ పుస్తకంలో పాతకాలంలో ఉన్నట్టుగా 'కాలమ్'లు పెంచుతామని కాంగ్రెస్ పదేపదే చెప్తున్నది. భూమి హక్కులకు సంబంధించి తెలంగాణలో రెవెన్యూ అధికారులు నిర్వహించేందుకు మొత్తం 11 రకాల రికార్డులు ఉంటాయి. అన్నింటా కలిపి సుమారు 200 కాలమ్స్ ఉండేవి. వీటిని నిర్వహించేందుకు ప్రత్యేకంగా సిబ్బంది ఉండేవారు. ఇదే తరహాలో మళ్లీ పాత కాలానికి తీసుకెళ్తామని కాంగ్రెస్ చెప్తున్నది. వీఆర్వో పోస్టులు భర్తీ చేస్తామని బాజాప్తా మ్యానిఫెస్టోలోనే ప్రకటించింది. అంటే.. మళ్లీ వీఆర్వోలను నియమించి, గ్రామ స్థాయిలోనే రైతుల భూములను ఇష్టం వచ్చినట్టు మార్చే పాత, రాత పద్ధతిని తీసుకొస్తామని చెప్పింది. దాంతో రాత్రికి రాత్రే రైతుల తలరాతలు మారిపోయే కాలం వస్తుంది. ఇదే జరిగితే ప్రశాంతంగా ఉన్న రైతులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసే పాత రోజులు మళ్లీ వస్తాయి.

రైతుబంధు కట్.. కొనుగోళ్లకు రాం రాం

ధరణి తీసేస్తే రైతును రైతుగా గుర్తించేదెవరు?

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌ను తీసేస్తే రైతులు వివరాలన్నీ ఆగమాగం అవుతాయి. రైతులు, కౌలురైతులు అంటూ రికార్డులన్నీ గందరగోళంగా తయారవుతాయి. దీంతో అసలు ఒక రైతును రైతుగా ఎవరు గుర్తిస్తారన్నదే పెద్ద సమస్యగా మారుతుంది. నేను రైతును అంటూ సర్టిఫికెట్లు తెచ్చుకోవాల్సి వస్తుంది. రికార్డు పారదర్శకంగా లేకపోతే రైతుబంధు అందించే అవకాశమే ఉండదు. ప్రస్తుతం సొంత ఊరిలోనే కాంట పెడుతున్నారు. కొనుగోళ్లు వెంటవెంటనే పూర్తవుతున్నాయి. డబ్బు నేరుగా అకౌంట్‌లో పడుతున్నది. ఈ సౌలభ్యాన్ని కూడా కాంగ్రెస్ ఎగవేయాలని చూస్తున్నది. 'చిట్టీల సంస్కృతి' తేవాలని చూస్తున్నది. ధరణి వచ్చాక ప్రతి రైతు వివరాలు ఆన్‌లైన్‌లో రికార్డయ్యాయి. ఈ రికార్డు ప్రభుత్వంతోపాటు అటు ఎల్ఐసీ దగ్గర ఉన్నది. రైతు మరణిస్తే.. ఆ వ్యక్తికి నిజంగా భూమి ఉన్నదో లేదో ధరణిలో చూస్తే తెలిసిపోతుంది. వెంటనే టిక్ కొట్టి ప్రీమియం కోసం దరఖాస్తు చేస్తారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు ఆన్‌లైన్‌లోనే రైతు వివరాలను సరిచూసుకొని, ప్రీమియం మొత్తాన్ని అకౌంట్‌లో వేస్తున్నారు. ఇంతటి సౌలభ్యాన్ని కాంగ్రెస్ వాళ్లు పోగొట్టాలని చూస్తున్నారు.

రైతుకు తొమ్మిదో భర్త!

కొత్తగా గ్రామసభను తెరపైకి తెచ్చిన కాంగ్రెస్

మళ్లీ అవినీతి తప్పదంటున్న నిపుణులు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటేస్తే 'గ్రామ సభ' రూపంలో రైతు తలపై మరో పిడుగు పడనున్నది. సీఎం కేసీఆర్ మాటల్లో చెప్పాలంటే 'రైతుకు కొత్త భర్త' రానున్నాడు. ఉమ్మడి రాష్ట్రంలో భూముల రికార్డుల మీద అధికారం అధికారుల చేతుల్లో ఉండేది. అది కూడా ఏ ఒక్కరికో కాదు.. గ్రామస్థాయిలో వీఆర్వోతో మొదలుపెడితే.. ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏ, రెవెన్యూ కార్యదర్శి, రెవెన్యూ మంత్రి.. ఇట్లా రాష్ట్రంలోని ప్రతి గుంట పొలం మీద 8 మందికి అధికారం ఉన్న పరిస్థితి. సీఎం కేసీఆర్ పరిభాషలో చెప్పాలంటే 'ప్రతి రైతుకు 8 మంది భర్తలు' ఉండేవాళ్లు. వాళ్లకు ఎదురుపడి నమస్కారం పెట్టకపోయినా, ఎదురు మాట్లాడినా.. పక్కోడో, పాలోడో, ఇంటోడో లంచం ఇచ్చినా, నాయకులు బెదిరించినా తెల్లారేసరికి రికార్డు మారిపోయేది. పదెకరాల రైతు కూడా తెల్లారేసరికి కూలీగా మారిపోయిన ఘటనలు వేలల్లో. పట్టాను తిరిగి తమ పేరుమీదికి మార్చాలంటూ వీఆర్వో నుంచి రెవెన్యూ మంత్రి వరకు అందరి చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు మళ్లీ కొత్తగా కౌలురైతులకు చట్టపరంగా హక్కులు కల్పిస్తామని, రైతులు, కౌలు రైతులు ఒప్పందం చేసుకోవాలని, గ్రామ సభ దీనిని ఆమోదించాలని కాంగ్రెస్ అంటున్నది. దీంతో రైతుపై కొత్తగా మరో వ్యవస్థ పెత్తనం చెలాయించనున్నది. కేసీఆర్ మాట్లలో చెప్పాలంటే 'రైతుకు తొమ్మిదో భర్త' వస్తాడు. మరో వైపు ఇప్పటివరకు రైతుబంధు అత్యంత పారదర్శకంగా సాగుతున్నది. కొత్త నిబంధనలతో విచ్చలవిడి అవినీతికి పాల్పడే అవకాశం కలగనున్నది. గ్రామస్థాయి అధికారులు లంచాలు, కమీషన్లు అడిగే పరిస్థితి వస్తుంది.

భూములను గుంజుకునే కుట్ర

ధరణి తొలగింపునకు కాంగ్రెస్ పన్నాగం!

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ధరణి రద్దు నినాదం వెనుక భూములను గుంజుకునే కుట్ర దాగున్నది. రాష్ట్రంలోని రూ.లక్షల కోట్ల విలువైన భూములపై కాంగ్రెస్ కన్నేసింది. వాటిని గుంజుకోవడానికి ప్రస్తుతం ధరణి పోర్టల్ వారికి అడ్డంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాత పద్ధతిలో రికార్డులు ఉండేవి. దీంతో నాయకులు ఇష్టారాజ్యంగా భూములు గుంజుకునేవారు. చోటా మోటా లీడర్ల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు భూముల మీద సంపాదించుకునేవారు. పెద్ద నేతలు తమ పరపతిని ఉపయోగించి రైతుల భూములను రాత్రికిరాత్రే పేర్లు మార్చేసేవారు. ఎకరాలకొద్దీ భూములను తమ పేర్ల మీదికి బదలాయించుకునేవారు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసేవారు. అట వీభూములను కూడా 'హస్త'గతం చేసుకునేవారు. ఇప్పుడు పోర్టల్ అమలులో ఉండంటతో ఇది సాధ్యం కాదు. కాబట్టే ధరణి అడ్డు తొలగించుకోవాలని పన్నాగం పన్నారు.

రైతు మెడకు 'కౌలు' దూలం

- కాంగ్రెస్ ఓటేస్తే మళ్లీ అమల్లోకి రానున్న కౌలు చట్టం
- రైతులు, కౌలు రైతుల మధ్య కొట్లాటలు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'కౌలు రైతులను మేం గుర్తించం. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల మెడలో దూలం కట్టదలుచుకోలేదు'.. కౌలు రైతుల గురించి సీఎం కేసీఆర్ అనేక సార్లు చెప్పిన మాట ఇది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు కౌలు రైతుల పేరుతో గుదిబండను తగిలిస్తామని స్పష్టంగా చెప్పింది. కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎలా ఇస్తారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తే '2011లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు చట్టాన్ని అమలు చేస్తాం' అని చెప్పారు. అంటే.. కౌలు రైతులకు మళ్లీ హక్కులు కల్పిస్తారన్న మాట. 2011 కౌలు రైతు చట్టం ప్రకారం.. రైతులు, కౌలు రైతులు ఒప్పందాలు చేసుకోవాలి. వాటిని ధ్రువీకరిస్తూ వీఆర్వో సంతకం చేయాలి. వారికి ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డు ఇస్తుంది. ఈ కార్డు ఉన్న వారికి విత్తనాలు, ఎరువులు అందుతాయి. ఆయా కౌలు రైతులకు బ్యాంకులు రూ.లక్ష వరకు రుణాలు ఇవ్వాలని ఆర్బీఐ అప్పట్లో ఆదేశాలు జారీ చేసింది. కొన్ని సందర్భాల్లో భూ యజమానులు ఒప్పుకోకపోతే వీఆర్వో, గ్రామ పంచాయతీ అధికారులు నేరుగా కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీ చేయవచ్చు. ఈ నిబంధనలన్నీ రైతు మెడకు గుదిబండగా మారాయి. ఇంకో ప్రమాదం ఏమిటంటే.. కౌలు రైతులు ముందుగా పహాణీల్లో 'కౌలు కాలమ్'లో చేరేవారు. అందులో కొందరు ఒకటి, రెండేండ్ల తర్వాత వీఆర్వోలు, ఇతర అధికారులకు లంచాలు ఇచ్చి కౌలు కాలమ్ నుంచి యజమాని కాలమ్‌లోకి పేర్లు మార్పించేవారు. దీంతో అసలు రైతు భూమిపై హక్కులు కోల్పోయి లబోదిబోమనేవారు. కొన్నేండ్లుగా కౌలు చేస్తున్నాం కాబట్టి ఆ భూమిపై హక్కులు కల్పించాలంటూ కోర్టులకు ఎక్కిన కౌలు రైతులు ఎందరో ఉన్నారు. ఇక కౌలు రైతు కార్డులు పొందిన వారు ఎలాంటి పూచీకత్తు లేకుండానే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటు ఉండేది. మరి వారు చెల్లించకపోతే?, కనీసం జప్తు చేయడానికి పూచీకత్తు కూడా ఉండేది కాదు. దీంతో బ్యాంకు అధికారులు రైతును ఇబ్బంది పెట్టేవారు. తర్వాతి ఏడాది రైతు రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే, కౌలు రైతుల రుణాలు చెల్లించేవరకు ఇవ్వబోమంటూ వెనక్కి పంపేసిన సందర్భాలు ఎన్నో. మరికొన్ని సందర్భాల్లో రైతు తన పొలంలో కొంత విస్తీర్ణమే కౌలుకు ఇచ్చినా, మొత్తం విస్తీర్ణం కౌలు కింద నమోదయ్యేది. ఫలితంగా ప్రభుత్వ పథకాలు, రుణమాఫీ వంటివి అందేవి కాదు. దీంతో కౌలుకు ఇచ్చిన పాపానికి రైతుకు శిక్ష పడేది. కాంగ్రెస్‌కు ఓటేస్తే కౌలు రైతులు అసలు యజమానులకు మెడ మీద కత్తిగా మారతారు.

రికార్డులన్నీ ఆగమాగం అయితయ్

ధరణిని ఎత్తేస్తే లంచగొండుల స్వైర విహారం ● భూమిపై చిక్కుముడి.. ప్రతి రైతుకో సమస్య

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే అవినీతి భూతాన్ని తరిమికొట్టి రైతులకు భరోసా కల్పించిన సంస్కరణలు కాలగర్భంలో కలిసిపోతాయి. ధరణిని ఎత్తేస్తే మళ్లీ భూముల రికార్డుల నిర్వహణ గ్రామస్థాయి, మండలస్థాయి అధికారుల చేతుల్లోకి వెళ్తుంది. భూములు కొత్తగా కొనుగోలు చేసేవారికి చుక్కలు కనిపిస్తాయి. పాస్‌బుక్ పొందాలంటే సవాలక్ష అడ్డంకులు కల్పిస్తారు. కాంగ్రెస్ పాలనలో డబ్బు ఇవ్వకుంటే రైతు దరఖాస్తు చెత్తబుట్టలోకి చేరేది. ధరణి పోర్టల్‌ను ప్రారంభించిన తర్వాత ప్రభుత్వం పెండింగ్ మ్యుటేషన్లకు అవకాశం కల్పిస్తే.. ఏకంగా 1.80 లక్షల దరఖాస్తులు రావడమే నాటి అవినీతికి, అవగాహన లేమికి నిదర్శనం. ఈ సమస్యలన్నింటికీ కేసీఆర్ చేపట్టిన సంస్కరణలు చెక్ పెట్టాయి.

- 2017లో భూ రికార్డుల ప్రక్షాళణకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.56 కోట్ల ఎకరాల భూముల రికార్డులను డిజిటలైజ్ చేశారు. కొత్త పాస్ పుస్తకాలను మంజూరు చేశారు. రికార్డులను ఇష్టం వచ్చినట్టు మార్చే సంస్కృతికి చరమగీతం పాడారు.
- పాస్ పుస్తకాల్లో ఉన్న కాలమ్‌లన్నింటినీ తొలగించి, హక్కుదారు కాలం మాత్రమే ఉంచారు. మరో పేరు చేర్చే అవకాశం లేకుండా చేశారు.
- రికార్డులు డిజిటలైజ్ కావటంతో వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారు. తమను పీల్చి పిప్పిచేస్తున్న వ్యవస్థ నుంచి రైతులకు విముక్తి కలిగింది.
- కొత్త రెవెన్యూ చట్టం, ధరణి పోర్టల్‌తో అధికారుల విచక్షణాధికారాలను కత్తిరించారు. రైతుకు తెలియకుండా, వేలిముద్ర వేయకుండా పట్టా మార్పిడి జరగకుండా చేశారు. ఎవరూ రికార్డును మార్చే పరిస్థితి లేదు.
- లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. అప్పటికప్పుడే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిపోతున్నది. అవినీతికి చెక్ పడింది.
- రికార్డులన్నీ సురక్షితంగా ఉండటంతో భూ వివాదాలకు చెక్ పడింది. రైతులు గుండెల మీద చేయి వేసుకొని నిద్రపోతున్నారు.
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఈ సంస్కరణలన్నీ సమాధి అవుతయ్. రైతులను ఆగం చేసే పాత వ్యవస్థలు వస్తాయి.

కాంగ్రెస్‌ను ఖతం చేయాలి

రైతులను అన్ని విధాలుగా సీఎం కేసీఆర్ ఆదుకుంటుంటే మరో పక్క కాంగ్రెస్ పార్టీ నిరంతరం కుట్రలు చేస్తున్నది. రైతుబంధు సాయం పంపిణీ నిలిపివేయాలని రెండోసారి కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. రైతు బంధు విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు దురదృష్టకరం. ఎవరెన్ని కుట్రలు చేసినా ఆపగలిగేది ఈ నాలుగు రోజులే. రైతులకు ఎలాంటి బెంగ అవసరం లేదు. తాత్కాలిక ఆటంకాలతో అధైర్యపడొద్దు. ఎన్నికల తరువాత యథావిధిగా రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. కేసీఆర్ ఉండగా రైతుబంధు, 24 గంటల కరెంట్, రైతుబీమాతోపాటు ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా ఆగదు.

- జగదీశ్‌రెడ్డి, విద్యుత్తుశాఖ మంత్రి

మళ్లా పంచాయితీలు!

ధరణిని తీసేస్తే వివాదాలు, కొట్లాటలే

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎక్కడైనా విలువైన వనరు ఉంటే దానికోసం గొడవలు, యుద్ధాలు జరుగుతుంటాయి. ఇప్పుడు తెలంగాణలో భూమి అనేది అత్యంత విలువైన వనరుగా మారింది. అయి నా ధరణి పోర్టల్‌తో రికార్డులు భద్రంగా ఉండటం, లావాదేవీలు అత్యంత పారదర్శకంగా సాగుతుండటంతో గొడవలు, కొట్లాటలు జరగకుండా గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయి. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు ఉంటే, ఇందులో 90 శాతానికిపైగా చిన్న సన్నకారు రైతులే. వాళ్ల ఆధీనంలో గుంట, రెండు గుంటలు మొదలు నాలుగెదు ఎకరాలలోపే భూమి ఉన్నది. ఆ భూమిని వదులుకోవడానికి ఎవరూ ఒప్పుకోరు. ఒకప్పుడు తెలంగాణలో ఎకరం భూమి రూ.50 వేల నుంచి రూ.2.5 లక్షల వరకు పలికేది. అయినా ఊర్లల్లో నిండా గెట్ల పంచాయితీలు ఉండేవి. గజం భూమి కోసం కూడా ఏండ్లకేండ్లు వివాదాలు నడిచేవి. దాడులు, ప్రతిదాడులు మొదలు హత్యల వరకు వెళ్లేది. ఇప్పుడు రాష్ట్రంలో ఎకరం భూమి రూ.40 లక్షల నుంచి రూ.3 కోట్ల మధ్య నడుస్తున్నది. పైగా వ్యవసాయం పూర్తి లాభదాయకం అయ్యింది. నీళ్లు వచ్చాయి, ఉచిత విద్యుత్తు అందుతున్నది. ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నది, విత్తనాలు సరఫరా చేస్తున్నది. ధాన్యం కొంటున్నది. వ్యవసాయం అత్యద్భుతంగా లాభసాటిగా మారింది. దీంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రతి అడుగు జాగా కూడా విలువైందే. ఇప్పుడు పెరిగిన ధరలకు ధరణి లాంటి పోర్టల్ లేకుంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటేనే భయంకరంగా ఉంటుంది. గతంలో వచ్చిన ఒక నివేదిక ప్రకారం సివిల్ కోర్టుల్లోని కేసుల్లో 66 శాతం భూ వివాదాలేనని చెప్పింది. దేశంలో జరుగుతున్న హత్యల్లో 14 శాతం.. అంటే ప్రతి వంద హత్యల్లో 14 భూ తగాదాల వల్లే జరుగుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. ధరణిని తీసేస్తే ఈ నేరాల సంఖ్య రెట్టిపయ్యే అవకాశం ఉంటుంది. కౌలు రైతులు వచ్చి చేరితే మరింత ముదురుతాయి. గ్రామాలు రావణకాష్ఠాన్ని తలపిస్తాయి.

రుణమాఫీ ఆపింది కాంగ్రెస్సే

రైతుబంధు, రుణమాఫీ ఆపింది కాంగ్రెస్ పార్టీయే. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రజాదరణను కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నరు. కర్ణాటకలో అడ్డగోలు హామీలిచ్చి అమలు సాధ్యం కాక చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇక్కడ మాత్రం అలవికాని హామీలతో ప్రజలను మోసం చేస్తున్నది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై ప్రజలకు నమ్మకం లేదు. ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్‌కే క్లారిటీ లేదు. అంతా డొంక తిరుగుడు మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసే ఆలోచనే తప్ప వారు అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదు.

-వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి

సాగును ఆపలేరు కదా?

డిసెంబర్ 3 తర్వాత రైతుబంధును అడ్డుకోలేరు. సాగు రంగాన్ని ఆపలేరు. వ్యవసాయరంగాన్ని నిలబెట్టాలన్న సదుద్దేశంతో సీఎం కేసీఆర్ రైతుబంధును తెచ్చారు. కోటి 50 లక్షల ఎకరాలకు 11 విడతలుగా రైతుబంధు అమలు చేస్తున్నాం. కాంగ్రెస్ నేతలు పథకాలను తాత్కాలికంగా ఆపగలరేమో, కానీ ప్రజలు ఎన్నుకొనే కేసీఆర్ ప్రభుత్వాన్ని అడ్డుకోలేరు.

- నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

మూడో తేదీ వరకే ఆపగలరు

బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు చూసి కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారు. అందుకే రైతు సంక్షేమానికి కేసీఆర్ అమలు చేస్తున్న రైతుబంధు పథకం సాయం అమలు చేయకుండా అడ్డుపడ్డారు. కాంగ్రెసోళ్లు సంక్షేమాన్ని వచ్చేనెల 3వ తేదీ వరకే ఆపగలరు. ఆ తరువాత ప్రతి సంక్షేమ పథకం అమలవుతుంది. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధితోపాటు ఎన్నికల మ్యానిఫెస్టోపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉన్నది. ప్రజా సంక్షేమానికి వినూత్న పథకాలను కేసీఆర్ అందిస్తారనే నమ్మకం ఉన్నది. అందుకే ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు.

-మహేందర్‌రెడ్డి, గనులశాఖ మంత్రి

రైతు భరోసా అందరికీ కాదు; ఒక్కరికే!

అబద్ధాన్ని ఎల్లకాలం దాచలేరు. అందర్నీ అన్నిసార్లూ మోసం చేయలేరు. తెలంగాణ రైతులకు భరోసా అంటూ కాంగ్రెస్ చేసిన 'గ్యారెంటీ' మోసం గుట్టు పీసీసీ చీఫ్ రేవంత్ నోటే బట్టబయలయింది. మాజీ ఎమ్మెల్సీ, పాత్రికేయుడు ప్రొ.నాగేశ్వర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రైతు భరోసా మోసాన్ని తనంతట తానే బయటపెట్టారు. తనకే అర్థం కాని రీతిలో ఏదేదో మాట్లాడి నవ్వులపాలయ్యారు!

● బీఆర్ఎస్‌తో 30 వేలు!

బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధుతో రైతుకు ఎకరానికి ఏడాదికి ప్రస్తుతానికి 10 వేలు, మున్ముందు 16 వేలు పెట్టుబడి సాయం అందుతుంది. రైతు ఒకవేళ తనభూమిని కౌలుకు ఇస్తే అదనంగా ఎంతోకొంత (దాదాపు 15వేలు) కౌలుమొత్తం వస్తుంది. ఈ లెక్కన రైతుకు ఎకరానికి 30వేలు లభిస్తుంది.

● కాంగ్రెస్‌తో 15 వేలు!

రేవంత్ చెప్పిన దాని ప్రకారం కాంగ్రెస్ రైతుభరోసాతో రైతుకు అయితే పెట్టుబడి సాయం, లేదంటే కౌలు .. ఏదో ఒకటే లభిస్తుంది. అంటే రైతు ఒకదాన్ని కోల్పోవాల్సి ఉంటుంది.



నాగేశ్వర్: రైతుభరోసా మీద ఇంపార్టెంట్ కామెంట్ ఒకటి వినిపిస్తున్నది. కౌలుదార్లకు ఇవ్వడం అంటూ మొదలుపెడితే భూయజమానులకు భయం మొదలవుతది. కౌలుదార్లకు చట్టాలున్నయ్. కౌలుకు ఇస్తే భూమి ఎక్కడ పోతుందోనని రేపు యజమానులకు భయం రాదా?

రేవంత్: మేం విస్పష్టంగా చెప్పినం. భూ యజమానికి ఇస్తం. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరిపి.. కౌలుదార్లు ఎవరు? ఏ భూమి కౌలుకు తీసుకున్నరు? వారి ఒప్పంద పత్రాలను చూసి గ్రామసభల్లో ఆమోదించిన తర్వాత తెలిసిపోతది.

నాగేశ్వర్: కౌలుకు ఒప్పంద పత్రాలుండవు కదా?

రేవంత్: లేదు. వాళ్లు ఏదైతే కౌలుకు మాట్లాడుకుంటరో అదే ఒప్పందం. 2011లో కాంగ్రెస్ పార్టీ కౌలుదార్ల చట్టమే తెచ్చింది. దానిప్రకారం కౌలుదార్లను గుర్తిస్తం. యజమానికి రావాల్సింది యజమాని ఖాతాలో పడుతది. కౌలురైతుకు రావాల్సింది కౌలుదారుకు వస్తది. భూమిలేని వాళ్లు ఉపాధి కూలీకి పోయేవారికి కూడా మేం మద్దతు ఇచ్చేలా ఇందులో పెట్టినం.

నాగేశ్వర్: సో.. ఈ లెక్కన అందరికీ ఇస్తరు?

రేవంత్: ఆల్‌మోస్ట్ అందరికీ ఇస్తం.

నాగేశ్వర్ : అప్పుడు డబుల్ డబుల్ పడుతది కదా?

రేవంత్: లేదు. ఓవర్‌లాప్ కాదు. వాళ్లకు వస్తే వీళ్లకు రాదు. వీళ్లకు వస్తే వాళ్లకు రాదు. ఎక్కడోద గ్గర అడ్జస్ట్ అవుతుంది కాబట్టి, హార్డ్‌బర్న్ ఉండదు. ఒకవేళ కౌలురైతులకు రాకపోతే, ఉపాధిహామీ కూలీల కింద వాళ్లకు ఆటోమేటిక్‌గా ఇస్తం. రైతు ఒప్పుకోకపోతే రైతుకు నష్టంచేయాల్సిన అవసరమే లేదు. ఇయ్యాల భూమి లేనివాళ్లకు కూడా 12వేల రూపాయలు ఆల్రెడీ ప్రకటించినం కదా. ఓవర్‌లాప్ లేకుండా కంప్యూటరైజ్ చేస్తాం కాబట్టి సమస్యనేలేదు.

వాళ్లకు వస్తే వీళ్లకు రాదు. వీళ్లకు వస్తే వాళ్లకు రాదు.

కాంగ్రెస్-బీజేపీ ఫెవికాల్ బంధం!

కాళేశ్వరం, రైతుబంధు ఉదంతాలే రుజువు

- కాళేశ్వరంలో ఓ పిల్లర్ కుంగిందంటూ అక్టోబర్ 22న కేంద్రానికి రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్ లేఖ
- రెండ్రోజుల్లో హైదరాబాద్‌కు కేంద్రబృందం రాక
- హడావుడిగా 5 రోజుల్లో నివేదిక సమర్పణ

- రైతుబంధు నిలిపేయాలంటూ ఈసీకి అక్టోబర్ 25న కాంగ్రెస్ లేఖ
- స్కీమ్‌కు బ్రేక్ వేస్తున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటన
- యాసంగి సీజన్ ఎత్తిపోయే అవకాశం ఉన్నందున రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీకి బీఆర్ఎస్ సర్కారు పలుమార్లు విజ్ఞప్తి
- బీఆర్ఎస్ విజ్ఞప్తి మేరకు 24న రైతుబంధుకు ఈసీ గ్రీన్‌సిగ్నల్
- ఎన్నికల ప్రచారంలో 'రైతుబంధు'ను ప్రస్తావిస్తున్నారంటూ 26న ఈసీకి కాంగ్రెస్ నేతలు నిరంజన్, రేవంత్ లేఖ
- రైతుబంధు నిధుల పంపిణీని 27న నిలిపేసిన ఎన్నికల సంఘం

మోదీకి వర్తించదా?

ఎన్నికల కోడ్ సమయంలో తెలంగాణలో రైతుబంధు నిధులు విడుదల చేయవద్దని వాదిస్తున్న కాంగ్రెస్‌కు.. కేంద్రంలోని బీజేపీ సర్కారు చర్యలు కనిపించట్లేదు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ ఉన్నప్పుడే 'పీఎం-కిసాన్' నిధులను విడుదల చేస్తున్నట్టు నవంబర్ 15న స్వయంగా ప్రధాని మోదీనే ప్రకటించారు. దీనిపై అటు ఈసీ చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ కూడా ఫిర్యాదు చేయలేదు.

-స్పెషల్ టాస్క్‌బ్యూరో, నమస్తే తెలంగాణ

**కాంగ్రెస్ లేఖలు రాయడం, వెంటనే బీజేపీ చర్యలు తీసుకోవడం.. ఇదీ కాంగ్రెస్-బీజేప